



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 161 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 15 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :161 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 15 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏపీ బడ్జెట్ ₹ 3,32,205 కోట్లు

### అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పంతో ఈ బడ్జెట్ ను రూపొందించామని చెప్పారు.

- రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంతో బడ్జెట్ రూపొందించామన్న పయ్యావుల
- రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు
- అమరావతి నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు
- విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ 28 వేల కోట్లు
- రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్ ను ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా బడ్జెట్ ను రూపొందించామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ విధానమని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపుకు తీసుకెళుతున్నామని పయ్యావుల చెప్పారు. రాయలసీమ రైతుల కలలను ఈ బడ్జెట్ సాకారం చేస్తుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా యువతకు గుండె నిబ్బరాన్ని ఇస్తుందని చెప్పారు. తొమ్మిది జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.



**శాఖల వారీగా కేటాయింపులు**

| | |
|---|---|
| పాఠశాల విద్యాశాఖ | రూ.32,308 కోట్లు |
| పంచాయతీరాజ్ | రూ.22,942 కోట్లు |
| వ్యవసాయం,అనుబంధ రంగాలు | రూ.13,598 కోట్లు |
| అన్నదాత సుఖీభవ | రూ.6,660 కోట్లు |
| పోలవరం | రూ.6,105 కోట్లు |
| హోంశాఖ | రూ.9,165 కోట్లు |
| మున్సిపల్ శాఖ | రూ.14,539 కోట్లు |
| అమరావతి | రూ.6 వేల కోట్లు |
| విద్యుత్ రంగం | రూ.13,934 కోట్లు |
| రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులు | రూ.13,546 కోట్లు |
| పరిశ్రమలు | రూ.3,161 కోట్లు |
| నష్టపరిహారం పిఠి | రూ.1,500 కోట్లు |
| వీబీ జీ రామ్ జీ | రూ.8365 కోట్లు |
| గృహ నిర్మాణం | రూ.5,451 కోట్లు |
| ఎన్టీఆర్ వైద్యసేవ | రూ.4,000 కోట్లు |
| జల్ జీవన్ | రూ.4,000 కోట్లు |
| స్వచ్ఛ భారత్ మిషన్ | రూ.1,037 కోట్లు |
| విశాఖ ఆర్థిక ప్రాంతం | రూ.28,000 కోట్లు |
| రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ | రూ.30,000 కోట్లు |

**ప్రతి జిల్లాకు ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్**

| | |
|---|---|
| జలవనరుల శాఖ | రూ.18,224 కోట్లు |
| హాస్టళ్లు, గురుకులాలు | రూ.300 కోట్లు |
| స్కాలర్ షిప్పు | రూ.3,836 కోట్లు |
| మధ్యాహ్న భోజన పథకం | రూ.2,161 కోట్లు |
| ఎన్టీఆర్ భరోసా | రూ.27,719 కోట్లు |

## ఉండవల్లిలో 'ఇల్లే వేదిక'..

### నేతలతో కలిసి భోజనం చేసిన నారా లోకేశ్...



- ఉండవల్లిలో ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం
- గుంటూరు, విజయవాడ నేతలతో ఆత్మీయ కలయిక కార్యక్రమం
- సమస్యల పరిష్కారంపై నేతలకు నివేదిక అందజేత
- హాజరైన మహిళలకు మంగళగిరి చేనేత చీరల బహూకరణ

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న 'ఆత్మీయ కలయిక – ఇల్లే వేదిక' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని తన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- విజయం అనంతరం తొలి ప్రసంగం చేసిన తారిఖ్ రెహ్మాన్
- బంగ్లాదేశ్ ప్రజలకే ఈ విజయం చెందుతుందన్న బీఎన్‌పీ అధినేత
- హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకుందామన్న తారిఖ్ రెహ్మాన్

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధా న్యం ఇస్తామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో...



## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- పుస్తకాల విషయంలో కొత్త నిబంధనపై కేంద్రం చర్చ
- 20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధన తేవాలని భావిస్తున్న కేంద్రం
- రిటైర్ అయ్యాక 20 ఏళ్ళ వరకు సున్నిత అంశాలపై పుస్తకాలు రాయకూడదనే నిబంధన

పెన్ పవర్ డెస్క్:మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక

- మిగతా 2లో...



## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరఫరా చేసే టెండర్లలో అక్రమాలు
- రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు సమాచారం
- విచారణ బాధ్యతలు సిట్ చీఫ్ రాజశేఖర్ బాబుకు అప్పగింత

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో

- మిగతా 2లో...



## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు... అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- కూటమి బడ్జెట్‌లో నాయకుల పేర్లు తప్ప కేటాయింపులు లేవన్న బొత్స
- మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేసి మోసం చేశారని విమర్శ
- ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర అప్పుల లెక్కలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని వ్యాఖ్య
- ఈ బడ్జెట్ ప్రజల ధైర్యాన్ని, స్థైర్యాన్ని దెబ్బతీసిందని తీవ్ర విమర్శ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆత్మస్తుతి... పరనింద అన్నట్టు

- మిగతా 2లో...

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

### అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్



పెన్ పవర్ డెస్క్: ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం జరిగింది. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసుపై ఇప్పటికే ఏసీబీ విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇప్పటికే కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు కూడా గవర్నర్ అనుమతి ఇచ్చారు.

- మిగతా 2లో...

## మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

### ప్రజల నమ్మకానికి నిదర్శనమన్న రాహుల్, ఖర్గే!




పెన్ పవర్ డెస్క్:: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ రాహుల్ ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

- మిగతా 2లో...



## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితంపై అమికస్ క్యూరీ సంచలన నివేదిక
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కంటిచూపు కోల్పోతున్నారని వెల్లడి
- కుడి కంటి చూపు 15 శాతానికి పడిపోయిందని నివేదికలో స్పష్టీకరణ
- వ్యక్తిగత వైద్యులతో చికిత్సకు అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- వైద్య కారణాలతో బెయిల్ కోసం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయన తన కంటిచూపును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని వెల్లడైంది. ఇమ్రాన్ జైలు పరిస్థితులపై

- మిగతా 2లో...

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారన్న బుగ్గన
- గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టు ఉందని వ్యాఖ్య
- వైసీపీ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఏపీ శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని

- మిగతా 2లో...

## ఏపీ బడ్జెట్‌పై మాజీ ఆర్థిక మంత్రి యనమల ఏమన్నారంటే...!

- ఏపీ బడ్జెట్ 2026-27పై యనమల రామకృష్ణుడు కామెంట్స్
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్ అని కితాబు
- ఆర్థిక క్రమశిక్షణ, రుణ నియంత్రణకు ప్రాధాన్యం
- పరిశ్రమలు, పెట్టుబడులకు పెద్దపీట వేయడంపై హర్షం
- సామాజిక న్యాయం దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ 2026-27 వార్షిక బడ్జెట్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశంసలు కురిపించారు. ఇది ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ అని అభివర్ణించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించారని అభినందించారు. ఈ సందర్భంగా యనమల స్పందిస్తూ... "బడ్జెట్‌లో

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ.2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ.1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృథ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440-495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునునికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850-895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100-70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళు ళ్ళ...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# ఉండవల్లిలో 'ఇల్లే వేదిక'..

- మొదటి పేజి తరువాయి

ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందిస్తూ... అందరూ కలిసి ఒకేచోట భోజనం చేస్తూ, మాట్లాడుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చిన వివిధ సమస్యలపై ఒక నివేదికను వారికి అందించినట్లు వివరించారు. వారు ఇచ్చిన విజ్ఞప్తులలో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు చెప్పారు. ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చిన మహిళలకు మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసినట్లు లోకేశ్ తెలిపారు.

గత కొన్ని రోజులుగా మంత్రి లోకేశ్ కూటమిలోని ప్రజాప్రతినిధులతో ఇలాంటి సుహృద్భావ సమావేశాలు నిర్వహిస్తుండటం ద్వారా పార్టీ శ్రేణులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- మొదటి పేజి తరువాయి

సీఐడీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్బీసీఎల డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై తాజా కేసు నమోదయింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా వ్యవహరించారని కేసు నమోదు చేశారు. రవాణా టెండర్లలో రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలను పాల్పడినట్టు సమాచారం. ఈ కేసు విచారణ బాధ్యతలను సిట్ చీఫ్ ఎస్పీ రాజశేఖర్ బాబుకు అప్పగించారు.

మరోవైపు, లిక్కర్ స్కామ్ లో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయంపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ స్కామ్ లో రూ. 3,500 కోట్లకు పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్టు సిట్ అధికారులు అంచనా వేశారు. ఈ కేసును ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది. పలువురు వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని అరెస్ట్ చేశారు. మరో 9 మంది విదేశాల్లో తలదాచుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు.

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- మొదటి పేజి తరువాయి

విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు... అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- మొదటి పేజి తరువాయి

బడ్జెట్ ప్రసంగం సాగిందని విమర్శించారు. ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదిసార్లు ప్రస్తావించడం తప్ప ప్రజలకు మేలు చేసే అంశాలు ఏవీ లేవని ఆయన దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న కొద్దిపాటి ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడా దెబ్బతీసిందని, ఇది మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బొత్స మాట్లాడుతూ, ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు.

మహిళా సాధికారతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "గతంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి, వారిలో పారిశ్రామిక స్ఫూర్తిని నింపడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సున్నా వడ్డీని అమలు చేశాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా ఆ సున్నా వడ్డీ పథకం ఏమైందో తెలియదు. బడ్జెట్‌లో దానికి కేటాయింపులు లేవు. ఎలాంటి ఆర్థిక చేయూత లేకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎలా మారుస్తారో చంద్రబాబు చెప్పాలి. ఇది మహిళలను మోసం చేయడం కాదా?" అని బొత్స ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం (చీ=జు+రా) నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం కోత పెట్టిందని బొత్స ఆరోపించారు. "గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే భరించేది. ఇప్పుడు కేంద్రం నిబంధనలు మార్చి మెటీరియల్, లేబర్ కాంపోనెంట్లలో 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో ఏటా సగటున రూ. 5,000 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసేవారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రం కనీసం రూ. 2,000 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చూపించారు. మిగిలిన బ్యాలెన్స్ సంగతేంటి? అంటే ఈ పథకాన్ని కూడా నీరుగార్చబోతున్నారా?" అని ఆయన నిలదీశారు.

రాష్ట్ర అప్పుల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి వారసత్వంగా రూ. 9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. "మా ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి మేం చేసిన అప్పు కేవలం రూ. 3 లక్షల కోట్లు మాత్రమే. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం రూ. 2.30 లక్షల కోట్ల అప్పు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే, అప్పుల భారాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు" అని బొత్స వివరించారు. ఈ బడ్జెట్‌లో కేవలం ప్రగల్భాలు తప్ప, నిర్దిష్ట కేటాయింపులు, ప్రజలకు భరోసా ఇచ్చే అంశాలు ఏవీ లేవని విమర్శించారు.

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

- మొదటి పేజి తరువాయి

ఈ కేసులో రాజకీయ, అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో ఏసీబీ ఛార్జ్‌షీట్‌కు దాఖలు చేసేందుకు సిద్ధమైంది.

రేసు'లో హెచ్ఎండీఏ భాగస్వామి కాకపోయినా, దాని ఖాతా నుంచి రూ.54.88 కోట్లు చెల్లించారు. ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే కేటీఆర్ ఇందుకు ఒత్తిడి తెచ్చారని ఏసీబీ నివేదికలో వెల్లడించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు చేయడం మరో అభియోగం. నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఫార్ములా -ఈ కార్ రేసుకు సంబంధించి మూడేళ్లలో 600 కోట్ల రూపాయలు చెల్లించేలా ఒప్పందాలు జరిగినట్టు దర్యాప్తు సంస్థలు తేల్చాయి.

## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- మొదటి పేజి తరువాయి

సార్వత్రిక ఎన్నికల్లో విజ యం సాధించిన అనంతరం ఆయన తొలి ప్రసంగం చేశారు. తమ విజయం బంగ్లాదేశ్ ప్రజలకే చెందుతుందని అన్నారు. ఇప్పుడు మనమంతా స్వేచ్ఛను పొందామని, హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకున్నామని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరికీ ఈ విజయన్ని అంకితమిస్తున్నామని అన్నారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలే దేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. కాగా, భారత్, చైనా వంటి దేశాలతో సంబంధాలలో సమతుల్యత పాటిస్తామని తారిఖ్ రెహ్మాన్ గతంలో అన్నారు. రెండు దేశాల నిర్ణయాలు, ప్రయోజనాలపై ఆధారపడి భారత్‌తో తమ సంబంధాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఏపీ బడ్జెట్‌పై మాజీ ఆర్థిక మంత్రి యనమల ఏమన్నారంటే...!

- మొదటి పేజి తరువాయి

చేసిన కేటాయింపులతో ప్రజా ఆకాంక్షలు నెరవేరతాయని ఆశిస్తున్నాం. ముఖ్యంగా రుణాలను నియంత్రించేలా ఈ బడ్జెట్ ఉంది. రుణాల రీ-షెడ్యూల్, వడ్డీ తగ్గించడం వంటి చర్యల ద్వారా ఆర్థిక శాఖ రాష్ట్రాన్ని అప్పుల నుంచి బయటపడేస్తుందన్న నమ్మకం ఉంది" అని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులు, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమని యనమల హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో, సామాజిక న్యాయం దిశగా బడ్జెట్‌ను తీర్చిదిద్దడం అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తం మీద ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

- మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశంసనీయమైన విజయాన్ని అందించిన అంకితభావం కలిగిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు నా కృతజ్ఞతలు. పీపుల్స్ తెలంగాణ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ పయనిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రజల నమ్మకానికి నిదర్శనం: మల్లికార్జున ఖర్గే**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు నమ్మకం ఉంచారని, ఆ నమ్మకమే ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని ఖర్గే పేర్కొన్నారు.

## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- మొదటి పేజి తరువాయి

నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది.ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది.

ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది. అయితే ఇది కేబినెట్ అధికారిక అజెండాలో భాగం కాలేదని, సాధారణ చర్చగా సాగిందని పేర్కొన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

- మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టుకు సమర్పించిన అమికస్ క్యూరీ (కోర్టుకు సహాయకుడు) నివేదిక ఈ షాకింగ్ విషయాలను బయటపెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇమ్రాన్ ఆరోగ్యం క్షీణించిందని పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' తన సంపాదకీయంలో తీవ్రంగా విమర్శించింది.కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సల్మాన్ సఫ్దార్, ప్రధాన న్యాయమూర్తి యహ్యా అఫ్రిది నేతృత్వంలోని ధర్మాసనానికి తన నివేదికను సమర్పించారు. గతేడాది అక్టోబర్ 2025 వరకు 6/6గా ఉన్న ఇమ్రాన్ కుడి కంటిచూపు, సరైన వైద్యం అందకపోవడం వల్ల ఇప్పుడు 15 శాతం కంటే తక్కువకు పడిపోయిందని నివేదికలో స్పష్టం చేశారు. కంటి వైద్యుడిని సంప్రదించేందుకు అనుమతించాలని పలుమార్లు కోరినా జైలు సూపరింటెండెంట్ పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఈ నివేదికతో పాకిస్థాన్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. దీనిపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు, ఇమ్రాన్‌కు వ్యక్తిగత వైద్యులతో చికిత్స అందించాలని, విదేశాల్లో ఉన్న తన కుమారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 16వ తేదీలోగా తమ

ఆదేశాలను అమలు చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. రాజకీయ ఖైదీ పట్ల ప్రభుత్వ తీరును 'క్రిమినల్ నిర్లక్ష్యం'గా అభివర్ణించిన ట్రిబ్యూన్ పత్రిక, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఇదిలా ఉండగా, వైద్య కారణాల దృష్ట్యా తోషాఖానా-×× కేసులో తనకు విధించిన శిక్షను నిలిపివేసి, బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ ఇమ్రాన్ ఖాన్ శనివారం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుడి కంటిలో రక్తం గడ్డకట్టడం వల్ల చూపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

### దామోదరం సంజీవయ్య జయంతి

### దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ జగన్ కితాబు

### పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంస



దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# ఆధ్యాత్మిక నిలయం గుడిలోవ పుణ్యక్షేత్రం





విశాఖ నగరానికి విశాఖ జిల్లాలో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు కోకోల్లాలు... నగరానికి సమీపంలో ఉన్న

ఆనందపురం మండలంలో

ఆధ్యాత్మికత, ప్రకృతి ఆహ్లాదం కలబోసుకొని భక్తులకు దివ్యానుభూతిని అందించే పవిత్ర స్థలం గుడిలోవ పుణ్యక్షేత్రం. ఆనందపురం మండల పరిధిలో కొండల మధ్య సోయగంగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం, భక్తుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం. ఇక్కడ కొలువుదీరిన శ్రీ రంగనాథ స్వామి ఆలయం అలాగే శ్రీ నారాయణేశ్వర స్వామి దేవాలయాలు కోరిన కోర్కెలు తీర్చే దైవాలుగా ప్రసిద్ధి చెందాయి.

**నిత్య జలధార :**

విశేషమైన దైవ చిహ్నం

గుడిలోవ ప్రత్యేకతల్లో ముఖ్యమైనది నిత్యం ప్రవహించే జలధార. కొండల మధ్యనుంచి ఉబికి వచ్చే ఈ జలస్రవంతి ముందుగా కొండపై ఉన్న “నారాయణ పాదాలు”ను తాకి, అక్కడి నుంచి క్రింద గర్భగుడిలో ప్రతిష్ఠించిన శివలింగం కిందుగా నిరంతరం ప్రవహిస్తుంది. ఈ జలధార ఎక్కడి నుంచి ఉద్భవిస్తుందో ఇప్పటికీ ఎవరికీ స్పష్టత లేకపోవడం విశేషం. భక్తులు దీనిని దైవ చమత్కారంగా భావిస్తారు.

ప్రతి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకుని ఈ పవిత్ర జలధారలో స్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తీకమాసం సందర్భంగా నిత్యాభిషేకాలు ఘనంగా జరుగుతాయి.

శివరాత్రి వేళ భక్తుల జాగరణ

ప్రత్యేకించి మహాశివరాత్రి సందర్భంగా గుడిలోవ క్షేత్రం భక్తులతో కళకళలాడుతుంది. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చి రాత్రంతా జాగరణ చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. కొండల మధ్య ప్రతిధ్వనించే హరినామసంకీర్తనలు ఆ ప్రాంగణాన్ని మరింత పవిత్రంగా మారుస్తాయి.

రంగనాథ స్వామి ఆలయ మహిమ


అదే ప్రాంగణంలో ఉన్న శ్రీ రంగనాథ స్వామి ఆలయం కూడా భక్తులను ఆకర్షిస్తోంది. శేషశయ్యపై విశ్రాంతి తీసుకుంటున్న మహావిష్ణువు రూపంలో స్వామివారు దర్శనమిస్తారు. ఈ ఆలయ స్థలపురాణం ప్రకారం, ఈ దేవాలయాన్ని విజయనగర రాజులు సుమారు వందేళ్ల క్రితం నిర్మించినట్టు ఆలయ అర్చకులు తెలిపారు. వారి పరిపాలనా కాలంలో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రముగా వెలుగొందిందని చెబుతారు.


ప్రకృతి సోయగాలతో ఆధ్యాత్మిక అనుభూతి

కొండల నడుమ, పచ్చని చెట్ల సాక్షిగా, నిత్యజలస్రవంతి మర్మర ధ్వనుల మధ్య గుడిలోవ క్షేత్రం భక్తులకు మానసిక ప్రశాంతతను అందిస్తోంది. నగర జీవితంలో అలసటకు గురైనవారికి ఇది ఆధ్యాత్మిక విశ్రాంతి కేంద్రముగా మారింది.

కోరికల సాధన కోసం, దైవ దర్శనానందం కోసం, ప్రకృతి ఒడిలో ప్రశాంత క్షణాల కోసం భక్తులు నిరంతరం తరలి వస్తున్న ఈ గుడిలోవ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక భూభాగంగా విశేష కీర్తి పొందుతోంది.

**-- పెన్ పవర్ కోసం ప్రత్యేక కథనం ఆనందపురం నుంచి నరసింహామూర్తి,**





01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## హైవే నిర్మాణంలో నిర్లక్ష్యం, ధూళి కాటుకు జి.మాడుగుల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో...



**జి.మాడుగుల: పెన్ పవర్ అల్లూరి సీతారామరాజు జిల్లా ఫిబ్రవరి (14)** జి.మాడుగుల మీదుగా సాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో అధికారులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జి.మాడుగుల పరిధిలో హైవే పనుల కారణంగా రహదారిపై ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిర్మాణ నిబంధనల ప్రకారం రోజుకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు సార్లు రహదారిపై నీటితో తడిపి ధూళి పైకి లేవకుండా చూడాల్సి ఉండగా, అధికారులు కేవలం నామమాత్రంగా నీళ్లు చల్లి వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా కాసేపటికే మళ్లీ దుమ్ము ధూళి ఎగిసి పడుతూ ఇళ్లలోకి, దుకాణాల్లోకి చేరుతోంది.

ఈ ధూళి కారణంగా వాహనదారులు రహదారిపై ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు కళ్లల్లోకి ధూళి పడటంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం పెరిగిందని వాపోతున్నారు. బస్సులు, కార్లలో ప్రయాణించే వారు కూడా ఊపిరి తీసుకోవడం కష్టంగా మారిందని చెబుతున్నారు. ముఖ్యంగా రహదారి పక్కనే ఉన్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. రోజంతా ధూళిని పీల్చుకోవడం వల్ల పిల్లలు దగ్గు, జలుబు, శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, ఆస్థమా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హైవే నిర్మాణం అభివృద్ధి కోసం అయినప్పటికీ, ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా చేపడుతున్న పనులు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి రోజూ క్రమం తప్పకుండా రహదారిపై నీటిని తడిపి, ధూళి నియంత్రణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# హైవే అధికారుల నిర్లక్ష్యం , గోతుల్లో దుర్గంధం







✸ దోమలతో జి.మాడుగుల వాసుల నానా అవస్థలు

**జి.మాడుగుల: పెన్ పవర్:** అల్లూరి సీతారామరాజు జిల్లా. ఫిబ్రవరి (14) జి.మాడుగులలో హైవే అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. లంబసింగి నుంచి పాడేరు వరకు జాతీయ రహదారి 516–ఈ విస్తరణ పనులు జరుగుతున్నప్పటికీ, జి.మాడుగుల పరిధిలో పనులు అస్తవ్యస్తంగా నిలిచిపోయాయి. రహదారి పక్కన డ్రైనేజీ కోసం తవ్విన గోతులను నిర్మాణం పూర్తిచేయకుండా నెలల తరబడి అలాగే వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తవ్విన గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో అవి దోమల పెంపక కేంద్రాలుగా మారాయి. అక్కడి నుంచి వెలువడుతున్న దుర్గంధం సమీప నివాసితులను వేధిస్తోంది. దోమల కారణంగా జ్వరాలు, చర్మ వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారని చెబుతున్నారు.

ఇక రహదారిపై ప్రయాణించేవారికీ కష్టాలు తప్పడం లేదు. అర్థాంతరంగా తవ్విన గోతులు, మట్టి కుప్పలతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. రాత్రివేళ ప్రమాదాల ముప్పు పెరిగిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రహదారి మరింత దుర్భరంగా మారుతోందని అంటున్నారు. డ్రైనేజీ పనులు పూర్తిచేయకుండా వదిలేయడం వల్ల ప్రజల జీవనం అస్తవ్యస్తమైందని, హైవే అధికారులు వెంటనే స్పందించి గోతులను మూసివేసి డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే వ్యాధులు మరింత వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.




## దామోదర సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా నివాళులు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 14 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండువ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి పురస్కరించుకొని శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దామోదర సంజీవయ్య సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించిన మహానుభావుడని అదనపు ఎస్పీ కేవి రమణ అన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన కట్టుబాటు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, డిసిర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా దామోదర సంజీవయ్య 105వ జయంతి వేడుకలు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 14 :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య 105వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ పూలమాలలు వేసి, జ్యోతిని వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ, హౌసింగ్ పి.డి మురళీ మోహన్, మార్కుఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర రావు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి విశిష్ట ఆధ్యాత్మిక ప్రసస్తి : కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 14 :** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విశేష ఆధ్యాత్మిక ప్రసస్తి కలిగిన మహాశివరాత్రి పండుగను అందరూ భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కోరారు. ఇదే సందర్భంలో శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు అయిన శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వర ఆలయం, రావివలస ఎండల మల్లిఖార్జున క్షేత్రంతో పాటు మిగిలిన ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చరవాణి ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాన ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా చేపట్టిన మౌలిక వసతుల కల్పన గురించి ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా దర్శనం జరిగేలా ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఎక్కువమంది ఉపవాస దీక్షలు చేస్తున్న సందర్భంలో ఆలయాల్లో మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జిల్లా అధికారులు పరిస్థితులను వివరించారు.

## రాష్ట్ర బడ్జెట్ లో సమతూల్యత పాటించారు.భీశెట్టి బాబ్జీ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. పిబ్రవరి 14 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ 2026,27 గాను ఆర్ధికమంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర శాసనసభలో శనివారం ప్రవేశపెట్టిన 3,32,205 కోట్ల రూపాయల రాష్ట్ర బడ్జెట్ లో కొంతమేరకూ సమతూల్యత పాటించినట్టు అనిపించిందని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రధాన కేంద్రాలుగా ఆర్థిక ప్రాంతీయ అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు వాటికోసం 28 వేల కోట్లు కేటాయింపు, రాయలసీమను ప్రత్యేక గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా దాని అభివృద్ధికి 30 వేల కోట్లు ప్రకటించడం, రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీసులు స్టేషన్లు ఏర్పాటుకు చొరవ తీసుకోవడం మంచి పరిణామమని భీశెట్టి అన్నారు. మూలధనం లోటు 53,915 కోట్లు, రెవెన్యూ లోటు 22 వేల కోట్లు ఉన్నప్పటికీ అమరావతికి 6వేల కోట్లు, పోలవరానికి 6,600 వందల కోట్లు, మేజర్ ఇరిగేషన్ సాగునీటి ప్రాజెక్టుల కోసం 9,906 కోట్లు, పాఠశాల విద్యకోసం 32,308 కోట్లు, జలవనరుల త్రాగునీరు ప్రోజెక్టుల కోసం 18,223 కోట్లు, ఎమ్.ఎస్.ఎమ్.ఈ. కోసం 3,161,స్కిల్ డెవలప్మెంట్ కోసం 1,232 కోట్లు, వ్యవసాయానికి 11,745 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖ కోసం 19,306 కోట్లు కేటాయించారని, వీబీజీ రాంజీకి 8,365 కోట్లు సరిపోవని, ఎన్.టి.ఆర్.వైద్య సేవలకు 4 వేల కోట్లు కూడా సరిపోవని, చతికిల పడ్డ సహకార చక్కెర ఫ్యాక్టరీలపై ప్రభుత్వం ఒక ప్రకటన చేసివుంటే బాగుండేదని భీశెట్టి బాబ్జీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు,

## ప్రజాసేవకు ప్రేరణగా నిలిచిన మహానేత దామోదర్ సంజీవయ్య ...



.అదనపు ఎస్పీ ఎం. వెంకటేశ్వరావు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. పిబ్రవరి 14 :** దామోదర్ సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరావు, ఇతర పోలీస్ అధికారుల మరియు సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం దామోదర్ సంజీవయ్య చేసిన కృషిని ఈ సందర్భంగా అదనపు ఎస్పీ గుర్తుచేశారు.

దామోదర్ సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక విశిష్ట నాయకుడు. ఆయన 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా లోని పెద్దపాడు గ్రామంలో జన్మించారని, సమాజ సేవ పట్ల ఆసక్తితో రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజల మన్ననలు పొందారని అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. సంజీవయ్య 1960 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 38 ఏళ్ల చిన్న వయసులోనే బాధ్యతలు స్వీకరించారన్నారు. ఆయన భారతదేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. ఆయన పరిపాలనలో పారదర్శకత, నిజాయితీ వలన రాజకీయాల్లో ఉన్నత నైతిక విలువలు పాటించిన నాయకుడిగా ఆయన పేరు పొందారు. దామోదర్ సంజీవయ్య గారు కేవలం ముఖ్యమంత్రిగానే కాకుండా, కేంద్ర కార్మిక మంత్రిగా కూడా సేవలందించారు. భారతదేశ తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించిన దామోదర్ సంజీవయ్య జీవితం అందరికీ ఆదర్శమని పేర్కొంటూ, కృషి, పట్టుదల, నిజాయితీ ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించి ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని, ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ వంటి విలువలను ప్రతి పోలీసు అధికారి ఆచరించి మరింత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బి సిఐ రమణమూర్తి,ఏఆర్ ఆర్ఐ నాయుడు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఏ–సూపరింటెండెంట్ శంకర రావు మరియు కార్యాలయం లోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

## రాజకీయానికి - ఆధ్యాత్మికతకు ముడి పెట్టవద్దు

✸ శివరాత్రి నుంచి అయినా తిరుపతి లడ్డు వ్యవహారానికి తెరదించాలి
✸ రాజకీయ పార్టీలకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విజ్ఞప్తి



**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 14**

తాను రాజకీయాలు మాట్లాడకూడదని అనుకున్నానని.. కానీ తిరుపతి లడ్డు వివాదం రోజురోజుకు మరింతగా కొన సాగుతున్న నేపథ్యంలో మీడియాతో మాట్లాడాల్సి వచ్చిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న తిరుపతి లడ్డు చుట్టూ రాజకీయాలు తిరుగుతూ ఉండడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికార పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీతో పాటు.. వైసిపి సహా అన్ని రాజకీయ పార్టీలు తిరుపతి లడ్డు వివాదాన్ని పక్కన పెట్టాలన్నారు. కనీసం శివరాత్రి నుంచి.. రాజకీయాన్ని ఆధ్యాత్మికతని ముడి పెట్టకుండా వ్యవహరించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, వైయస్ జగన్మోహన్ రెడ్డి అందరూ కూడా.. పవిత్రమైన తిరుపతి లడ్డు వివాదానికి ఇప్పటికైనా తెర దించాలని విజ్ఞప్తి చేశారు.


# దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో స్మరణ సభ







**విశాఖ దక్షిణం పెన్ పవర్, ఫిబ్రవరి 14 :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని విశాఖపట్నం కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శా ఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో అధికారులు ఆయన సేవలను స్మరించుకు న్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పా టు చేసిన సంజీవయ్య చిత్రపటానికి ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సత్తిబాబు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ, సంజీవయ్య ప్రజా హిత పరిపాలనకు ప్రతీకగా నిలిచారని, సామా జిక న్యాయం సాధనలో ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకురా లు శ్యామల, కలెక్టరేట్ పరిపాలనా అధికారి బి.వి. రాణి తదితర అధికారులు పాల్గొని సంజీ వయ్య బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆలోచనలు నేటి తరాలకు మార్గదర్శకంగా ని లుస్తాయని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.




# వడ్లపూడి బస్సు స్టాప్ లో అన్ని బస్సులు ఆపాలి

- డిపో మేనేజర్ కి వినతి పత్రం అందజేసిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం






**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,ఫిబ్రవరి 14 :**మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డ్ పరిధి వడ్లపూడి హైవే లో ఉన్న రిక్వెస్ట్ బస్ స్టాప్ ను పర్మనెంట్ బస్టాప్ గా చేయాలని రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం కూర్మన్నపాలెం బస్ డిపో మేనేజర్ రావు నీ కలిసి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ వడ్లపూడి 87 వ వార్డు ప్రాంతంలో సుమారు ముప్పై వేల మంది జనాభా నివసిస్తున్నారని వారిలో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు ప్రతిరోజు ఆర్టిసి బస్ లను వినియోగించి ప్రయాణిస్తున్నారని ముఖ్యంగా వడ్లపూడిలో భవిత స్కూల్ మానసిక అంగవైకల్య విద్యార్థుల తల్లి దండ్రులు విద్యార్థుల దూర ప్రాంతాల నుండి వస్తున్న వారు ఆర్టీసీని వినియోగించడం జరుగుతుందని ఇక్కడ బస్సులు ఆపకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని వడ్లపూడిలో ప్రతి బస్సు ఆపే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు,కణితి ఈశ్వరరావు, గండేపల్లి రాము,కోరుకొండ కళ్యాణ్ చక్రవర్తి, అప్పలనాయుడు, బోండా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కు బరోసా మంత్రి నారా లోకేష్

- సర్పంచ్ బాలి రాంబాబు నాయుడు



**ఆనందపురం, పెన్ పవర్ , ఫిబ్రవరి 14:**బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని, రాష్ట్రాభివృద్ధి,ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండి లా పరుగులు పుట్టించేలనె సంకల్పం వంటిది అని తర్లువాడ పంచాయతీ సర్పంచ్ బాలి రాంబాబు నాయుడు అన్నారు.ప్రపంచ తలరాతని మార్చే ఆయుధం ఏదైనా ఉందా అంటే అది కేవలం విద్యే అని నెల్సన్ మండేలా అన్న మాటలు నిజం చేస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి తో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2026-2027 ఆర్థిక బడ్జెట్ లో విద్యా శాఖ కు 32.308 కోట్లు రూ ప్రవేశం పెట్టడం జరిగింది.బడ్జెట్ విడుదల లో బాగంగా పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులు కు చేయూత గా మంత్రి నారా లోకెష్ 1200 కోట్లు రూ ఫీజు రీయింబర్స్ బకాయిలు కింద విడుదల చేయడం హర్షనీయమని తర్లువాడ పంచాయతీ సర్పంచ్ బాలి రాంబాబు నాయుడు అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి వరకూ విద్యార్థులు కు నాణ్యమైన విద్యను అందించడం కోసం వారి ఉజ్వల భవిష్యత్తు కు,వ్యక్తిగత వికాసానికి,సామాజిక - ఆర్థిక ప్రగతికి తోడ్పాలనే ఆలోచనతో విద్యా వ్యవస్థ లో గత ప్రభుత్వ పాలనలో కంటే సమగ్ర అభ్యాసం, మెరుగైన మౌళిక సదుపాయాలు,సురక్షిత వాతావరణం, నైపుణ్యం కలిగిన ఉపాద్యాయులు తో బోధన,విలువలతో కూడిన విద్య,ఇలా పలు సంస్కరణలు తో విద్య కు సుస్థిర స్థానం కల్పిస్తూ పెద్ద పీట నారా లోకేష్ వేసారని ఉద్ఘాటించారు.విద్య పట్ల ఆయన విద్యార్థులకు అండగా నిలుస్తూ వారి ఉన్నత విద్య కలలను సాకారం చేస్తుండటం లోకేష్ చిత్తుశు ద్ధి పాలనకు నిదర్శనం అని అన్నారు.

# ఉత్తరవాహినిలో పుణ్య స్నానాలకు సర్వం సిద్ధం





**-స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 14) :**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం నియోజకవర్గంలో బలిఘట్టం వద్ద గల ఉత్తరవాహిని నదిలో పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఉత్తరవాహిని నది వద్ద ప్రభుత్వ పక్షాన అత్యంత వైభవంగా గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 15, 16 మరియు 17 తేదీలలో భక్తులు ఈ పుణ్యనదిలో స్నానాలు ఆచరించడానికి వీలుగా ఘాట్ల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. నదిలో నీరు ఉండేలా రెండు రోజులు ముందే రావణాపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. మహిళలు స్నానం అనంతరం బట్టలు మార్చుకునేందుకు అనుకూలంగా ప్రత్యేక గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెల్లవారుజాము నుండే భక్తులు స్నానాలకు వస్తారనే ఉద్దేశంతో మెయిన్ రోడ్డు నుంచి ఉత్తరవాహిని వరకు ఫ్లడ్లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శివరాత్రి జాగరణ అనంతరం, 16వ తేదీ సోమవారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకునే భక్తుల సౌకర్యార్థం పాకలపాటి గురువుగారి ఆశ్రమంలోనూ, సత్యనారాయణ మూర్తి గుడి వద్ద అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సేవా కార్యక్రమాల్లో అన్నపూర్ణ అక్షయ పాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా భాగస్వాములు కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భక్తులందరూ ఈ పవిత్ర నదిలో స్నానాలు ఆచరించి, పరమేశ్వరుని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని, ఈ ఆధ్యాత్మిక వేడుకలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

# వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ





**గాజువాక:పెన్ పవర్ ,ఫిబ్రవరి 14** జీవీఎంసీ పరిధి 65 వ వార్డ్ బానోజీ తోట గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ ఈరోజు ప్రముఖ న్యాయవాది పెంటకోట నాగేశ్వరరావు, బాలామణి వారి వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారి ఆర్థిక సహాయముతో అన్నప్రసాద వితరణ ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుర్లభ కృష్ణ ప్రేమ దాస్ ప్రభుజి ఇస్కాన్ టెంపుల్,విజయకుమార్ నాయక్ నేషనల్ వైస్ చైర్మన్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ విచ్చేసి వారి చేతుల మీదుగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు . ముఖ్య అతిథులు మాట్లాడుతూఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం అన్నప్రసాద వితరణలో మేము కూడా పాల్గొనడం మా అదృష్టమని వెంకటేశ్వర స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు.ఏడు వారాలు నిష్టతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి ప్రదర్శలు చేసి స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం అని అన్నారు. ప్రతి శనివారం అన్నమాచార్య కీర్తన ఆలాపన దుర్గాప్రసాద్ భవాని వారి సారథ్యంలో జరిగినది. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, పూడి శాంతి, పప్పల ఆదిలక్ష్మి, గౌరుసు రామలక్ష్మి, తిప్పల స్వాతి, ఓమి ఈశ్వరి మరియు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సేవకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా రాష్ట్ర బడ్జెట్ సిపిఎం ఆక్షేపణ

**జీవీఎంసీకి నిధుల కేటాయింపులేమీ లేవని ఎం. జగ్గునాయుడు విమర్శ**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కేశవ్ శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా, సామాన్య ప్రజలకు నష్టం కలిగించేలా ఉందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునా యుడు విమర్శించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధా నాలను తీవ్రంగా తప్పుబట్టారు. పారిశ్రామికాభి వృద్ధి, మౌలిక సదుపాయాల పేరుతో పెద్ద ఎత్తున ప్రకటనలు చేసినప్పటికీ, వాస్తవ కేటాయింపులు కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు రూ.28 వేల కోట్లు సమీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడం వెనుక కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలపై ఆధారపడే విధానమే ఉన్నదని, దీనివల్ల ప్రభుత్వ భూములు, సహజ వనరులు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే పరిస్థితి ఏర్పడు తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ విధానంలో అనుభవం కలిగిన ప్రైవేటు సంస్థలకు ప్రాజెక్టులు అప్పగిస్తామనే ప్రకటన ప్రభుత్వ ఉద్దేశాలను బహిర్గతం చేస్తోందని అన్నారు. జీవీఎంసీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు, రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక కేటాయిం పులు చేయకపోవడం దురదృష్టకరమని జగ్గునాయుడు వ్యాఖ్యానించారు. స్మార్ట్ సిటీ పథకం కింద రావాల్సిన రూ.290 కోట్లు, 15వ ఆర్థిక సంఘం కింద రావాల్సిన రూ.450 కోట్లు ఇప్పటివరకు ఇవ్వలేదని, ఐదవ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకపోవడం తో మరో రూ.500 కోట్లు నష్టపోయిందని తెలిపారు. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు లేవని విమర్శించారు.

విమ్స్‌ను సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ నిధులు కేటాయించకపోవడం వెనుక ప్రైవేటు ఆసుపత్రులకు లాభం చేకూర్చాలనే ఉద్దేశం ఉన్నదని ఆరోపించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, మహిళలు, విద్యా ర్థులు, సాధారణ ప్రజల రవాణా అవసరాల కోసం కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు నిధులు కేటాయించలేదని తెలిపారు.

యువతకు నిరుద్యోగ భృతి చెల్లింపు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీపై స్పష్టమైన హామీలు ఇవ్వలేదని పేర్కొంటూ, అభివృద్ధి పేరుతో ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే విధంగా బడ్జెట్ రూపుదిద్దుకుందని జగ్గునాయు డు విమర్శించారు. ప్రజా వ్యతిరేకంగా భావిస్తు న్న ఈ బడ్జెట్‌ను ప్రజలు తిరస్కరించాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

## వార్డు--సచివాలయ స్థాయిలో కమిటీల

- నిర్మాణం వేగవంతం చేయాలి కె.కె. రాజు పిలుపు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :**జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వ హించిన జిల్లా వాలంటీర్ విభాగ సమావేశంలో పార్టీ బలోపే తానికి కార్యాచరణపై కీలక చర్చలు జరిగాయి. జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ స మావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు ము ఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ వార్డు మరియు సచి వాలయ స్థాయిలో పార్టీ కమిటీల నిర్మాణాన్ని త్వరితగ తిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామం నుంచి నగర స్థాయి వరకు పార్టీ నిర్మా ణాన్ని పటిష్టం చేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి వార్డు, ప్రతి సచి వాలయంలో కార్యచరణాత్మక బృందాలను ఏర్పాటుచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.వాలంటీర్ విభాగం జోనల్ అధ్యక్షుడు ఎం. సునీల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస రెడ్డి, నియో జకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరావు, నాగమణి, రమా స్వరూప రెడ్డి, వెంకటరమణతో పాటు విభాగ సభ్యులు శ్రీనివాస్, జాకీం, సిరాజ్, కృ పా, గణేష్, జాన్సన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశం సందర్భంగా వాలంటీర్ల సమన్వ యం, కార్యాచరణ ప్రణాళికలు, రాబోయే కార్యక్రమాలపై కూడా చర్చించారు.

## శ్రీ వరసిద్ధి వినాయకుడు ద్వితీయవార్షికోత్సవం



**గాజువాక :పెన్ పవర్ ,ఫిబ్రవరి 14** జివియంసి 66వ వార్డు కైలాష్ నగర్ శ్రీ వరసిద్ధి వినాయకుని రెండవ వార్షికోత్సవం జలభిషేకం, పంచామృత అభిషేకం, భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు , ఈ కార్యక్రమం శ్రీ వినాయక హౌస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు , ఈ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ,వార్డ్ కమిటీ సభ్యులకు శ్రీ వరసిద్ధి వినాయక ఆశీస్సులు గ్రామం అంతా ఉండాలని కోరారు . అసోసియేషన్ సభ్యులు పెద్దలు భాష్యం త్రినాథ్ కి, మోహన్ , భద్రం , రెడ్డి జగన్నాథం , వేణు , ధనరాజు , వెంకటరమణకి, నారాయణ రావు , జగదీష్ , ఈశ్వరరావు, ఆకుల శ్రీను, ఇంకా నిరంతరం కష్టపడుతున్న హౌస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు . కైలాష్ నగర్ కుటుంబ సభ్యులందరికీ వినాయకుడు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూన్నామని అన్నారు .

# అభివృద్ధి పరవళ్లు తొక్కుతున్న 90వ వార్డు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 90వ వార్డు అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేసింది. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో విమాన్ నగర్ ప్రాంతంలో తారు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. శనివారం ఉదయం ఈ పనులు సుమారు రూ. 48.50 లక్షల అంచనా వ్యయంతో జీవీఎంసీ నిధుల ద్వారా చేపట్టబడుతున్నాయి.

ఈ కార్యక్రమానికి విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు సలహా, సూచనల మేరకు 90వ వార్డు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ8 "వార్డులో ఏ సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించడం మా బాధ్యత. అభివృద్ధే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. విమాన్ నగర్ ప్రాంత ప్రజలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉండబోతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, విమాన్ నగర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ కుమార్, నాగు, బ్రహ్మేశ్వరరావు, సత్యం, శ్రీనివాస్ చౌదరి, గణేష్, రమేష్, విష్ణు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నరవ పైడిరాజు, పోతల సతీష్, శ్రీనివాస్, హరికృష్ణ, గోపాలరావు, మురళి, కూటమి నాయకులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ వాసులు 90వ వార్డును అందంగా తీర్చిదిద్దుతున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణకి హర్షధ్వానాలతో అభినందనలు తెలియజేశారు.

## పార్టీ కోసం కష్టపడి పని చేసే వారినే కమిటీలలో నియమించాలి - చిన్న శ్రీను



**ఆనందపురం ,పెన్ పవర్ , ఫిబ్రవరి 14:**
"మాటలు తో కోటలు కట్టే వారి కంటే తేతలతో పని చేసే వారికే నా దగ్గర ప్రాధాన్యత ఉంటుంది అని చిన్న శ్రీను అన్నారు".
భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆనందపురం మండల వైసిపి పార్టీ కార్యాలయం లో "వైసిపి పార్టీ కమిటీల నియామకం" పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించారు.మండల వర్కింగ్ కమిటీ అద్యక్షులు మజ్జి వెంకట్రావు కమిటీల నియామకం ప్రతులు ను చిన్న శ్రీను కు సమర్పించారు.కార్యక్రమం ను ఉద్దేశించి చిన్న శ్రీను మాట్లాడుతూ వైసిపి పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే వారికి,చురుకైన కార్యకర్తలకు,గ్రామ వార్డు స్థాయిలో ప్రజలతో బలమైన అనుబంధం ఉన్న వారిని పార్టీ కమిటీల్లో నియమిస్తూ ప్రాధాన్యత కల్పించాలని భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులు తో అన్నారు.నియోజవర్గంలో ఇప్పటికే అనుబంధ విభాగాల కమిటీలు పుర్తియ్యాయి మిగితా ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని నొక్కి చెప్పారు.పార్టీ కోసం శ్రమించి పని చేసే ప్రతీ ఒక్కరకీ భవిష్యత్తులో మంచి గుర్తింపు లభిస్తుంది అని చిన్న శ్రీను అన్నారు.పార్టీ కి కార్యకర్తలు బలం యువకులు వెన్నుముఖ అని ఆయన ఉద్ఘాటించారు.రాబోయే ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చూడాలని ప్రతీ ఒక్కరికీ తపన ఉంది ఆయనను ముఖ్యమంత్రి చేయాలంటే మనలో ఉన్న చిన్న చిన్న మనస్పర్ధలు ను విడిచి పెట్టి వైసిపి పార్టీ అనేది ఒక రాజకీయ పార్టీ కాదు వైసిపి పార్టీ మన అందరి కుటుంబం అని ప్రతీ ఒక్కరు గ్రహించి గడప గడప కు వెళ్ళి ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయని పాలనను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ఆనందపురం మండల వర్కింగ్ కమిటీ అద్యక్షులు మజ్జి వెంకట్రావు,మండల వైసిపి పార్టీ ఉపాధ్యక్షులు శినగం దాము,విశాఖ జిల్లా యువజన విభాగం మాజీ ప్రదాన కార్యదర్శి ఇల్లాపు వెంకట్ జగన్, నియోజకవర్గం విద్యార్థి విభాగం రౌతు శ్రీను,బుటుపిల్లి కళ్యాలు యంపిటిసి,వాణిజ్య విభాగం అధ్యక్షుడు రాంజీ, నాయకులు శినగం రాంబాబు,శినగం అప్పల రాజు, తదితరులు పాల్గొన్నారు.ద

## హార్బర్ ఏసీపీగా ఐ. చిట్టిబాబు బాధ్యతల స్వీకారం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :**విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధి లో హార్బర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా ఐ. చిట్టిబాబు శనివారం అధికారికంగా బాధ్యత లు స్వీకరించారు. హార్బర్ ఏసీపీ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సంద ర్భంగా కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఐ. చిట్టిబాబు నగరంలో విభిన్న విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో ఏసీపీగా విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై హార్బర్ ఏసీపీగా నియమితులయ్యారు. గతంలో నగర టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా పనిచేసి తన పనితీరుతో ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.
నూతన బాధ్యతల్లో చట్టం–శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని ఈ సంద ర్భంగా ఐ. చిట్టిబాబు తెలిపారు.

## భీమిలి జడ్పీ గెస్ట్ హౌస్ పునరుద్ధరణకు రూ.22 లక్షలు మంజూరు




**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :**భీమిలి జడ్పీ గెస్ట్ హౌస్ పునరుద్ధరణ పనులకు రూ.22 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. సుమారు 35 సంవత్సరాల క్రితం బీచ్ రోడ్డు ఎగువపేట ప్రాంతంలో నిర్మించిన ఈ గెస్ట్ హౌస్ కాలక్రమేణా శిథిలావస్థకు చేరడంతో, మరమ్మతులు అత్యవసరంగా మారాయి.
స్థానిక ఎమ్మెల్యే గెస్ట్ హౌస్‌ను పునరుద్ధరించి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని అధికా రులను ఆదేశించారు. ఆయన సూచనల మేర కు అధికారులు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసి, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.22 లక్షలను కేటాయించినట్లు జడ్పీ సీఈఓ పి. నారాయణమూర్తి వెల్లడించారు.అయితే పూర్తి స్థాయి పునరుద్ధరణకు ఈ మొత్తం సరిపోదని, అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూ రు చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమా చారం. మరమ్మతుల పనులు త్వరలో ప్రారంభ మవుతాయని అధికారులు తెలిపారు.

## బెహరా పాలిటెక్నిక్ విద్యార్థులకు క్యాంపస్‌లోనే ఉద్యోగావకాశాలు



**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :** నరవ బెహరా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పలు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం ఆనందదాయకమని విద్యాసంస్థల కార్యదర్శి డా. బెహరా చైతన్య తెలిపారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా సుమారు 80 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఎంపిక కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ సుకన్య వివరాల ప్రకారం, చెన్నైకు చెందిన సూపర్ ఆటో ఫోర్జ్ ప్రైవేట్ లిమిటెడ్, డెల్ఫింగెన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అలాగే గురుత్వాండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు క్యాంపస్ నియామక ప్రక్రియ నిర్వహించాయి. ఈ సంస్థల ప్రతినిధులు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం, మరియు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పరిశీలించి తుది ఎంపిక చేశారు.
ఎంపికైన విద్యార్థులు మెకానికల్, ఎలక్ట్రికల్, మరియు సంబంధిత ఇంజనీరింగ్ విభాగాలకు చెందినవారని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన బోధన, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, మరియు ప్లేస్మెంట్ సౌకర్యాల కారణంగా విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకున్నారని యాజమాన్యం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధి బాలమురుగన్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, ప్లేస్మెంట్ అధికారి ప్రవీణ్ కుమార్, మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలను క్యాంపస్‌కు ఆహ్వానించనున్నట్లు యాజమాన్యం పేర్కొంది. క్యాంపస్ ప్లేస్మెంట్ల ద్వారా విద్యార్థులు తమ విద్య పూర్తయ్యే లోపే ఉద్యోగాలు పొందడం సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచిందని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీ సీతారామ అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :** గ్రేటర్ విశాఖ, జీవీఎంసీ 91వ వార్డు పాత గోపాలపట్నంలో శ్రీ సీతారామ అభయ ఆంజనేయ గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతారామ అభయాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.
ఈ పుణ్యసందర్భంగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులతో కలిసి తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో ఇలాంటి మహోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ముమ్మన సత్యనారాయణ, అధ్యక్షులు పి.ఎన్. రాజు, ఉపాధ్యక్షులు కరణం కనకరాజు, బల్లంకి వెంకట్రావు, పొట్నూరి శంకర్రావు, గొలగాన అప్పలరాజు, కార్యదర్శి కొప్పాక సన్యాసిరావు, వై.డి. శివకుమార్, బి. తోటారావు, టి. చంటి, శ్రీను, కృష్ణ, గేదెల మురళీకృష్ణ, కంపర కోటేశ్వరరావు, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ మహోత్సవాలు భక్తులలో భక్తి, ఐక్యత, సేవా భావాలను మరింత బలపరిచినట్టు నిర్వాహకులు తెలిపారు.

## గ్రామస్తుల అభిప్రాయాలకు విరుద్ధంగా రహదారి ప్రారంభం

- ఇష్టానుసారంగా రహదారి పనుల ప్రారంభోత్సవం
- అడుగడుగునా ప్రోటోకాల్ ఉల్లంఘన

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఫిబ్రవరి 14:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయితీ ఎలుగు రాతి బంధ గ్రామానికి చెందిన గిరిజన కానిస్టేబుల్ కు ఇచ్చిన హామీ మేరకు చేపట్టిన రహదారి నిర్మాణం గ్రామస్తుల అభిప్రాయాలను పక్కనబెట్టి సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజల సూచనలు పట్టించుకోకుండా, గుత్తేదారుడికి అనుకూలంగా స్థానిక నాయకులు వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు.గ్రామస్తుల అభ్యంతరాలను పట్టించుకోకుండా పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులను హాజరుకావాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే, తమ అభిప్రాయాలను గౌరవించకుండా నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనబోమని గ్రామస్తులు స్పష్టంచేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రహదారి ప్రారంభోత్సవం గ్రామస్తుల నిరసనల మధ్య జరిగినట్లు సమాచారం. కార్యక్రమానికి అల్లూరి జిల్లా టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి హాజరైనట్లు సమాచారం.గ్రామ ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ ప్రజలకు అనుకూలంగా రహదారి నిర్మాణం చేపట్టాలని అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వెల్లంకి సర్వీస్ రోడ్డులో మురుగు నీటి సమస్యకు తక్షణ పరిష్కారం



**బిమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** మండలంలోని వెల్లంకి గ్రామం సమీపంలో ఉన్న నేషనల్ హైవే సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన మురుగు నీటి సమస్యకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో పాదచారులు, వాహ నదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు శనివా రం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మురుగు నీరు రోడ్డుపైకి రావడానికి గల కారణాలను సమగ్రంగా అధ్యయనం చేశారు. డ్రెయిన్‌లో చెత్త, మట్టితో ఏర్పడిన అడ్డంకులను జేసీబీ సాయంతో తొలగించి నీటి ప్రవాహాన్ని సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జి. శ్రీనుబాబు, నేషనల్ హైవే విభాగం ఇంజనీర్ అబ్దుల్ కరీం, ఇరిగేషన్ ఏఈ విజయ్, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలు లేకుండా ప్రారంభోత్సవాలా..?

- తెదేపా పాడేరు ఇంచార్జ్ కి మస్కా కొట్టిన మండల నాయకులు
- ఎలుగురాతిబంద రోడ్డు ప్రారంభోత్సవంలో అడుగడుగున ప్రోటోకాల్ ఉల్లంఘన

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 14:**కానిస్టేబుల్ కొలువు సాధించిన గిరిజన యువకుడు కోరిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి రోడ్డును మంజూరు చేశారు.ఆ రోడ్డు పనులకు ప్రభుత్వం చకచకా నిధులు విడుదల చేసింది.అక్కడి వరకు బాగానే ఉన్నా ఆ గ్రామ గిరిజనుల కోరిక మాత్రం తీరడం లేదు.ఇదేమీ పట్టించుకోండా మండల తేదేపా నాయకులు ఆ రోడ్డు పనులను పాడేరు నియోజకవర్గ ఇంచార్జి ద్వారా ప్రారంభించేసి ఆమె మెప్పు పొందాలని హడావిడిగా రప్పించారు.తీరా ఆ రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఇంచార్జ్ వెళితే అక్కడి గిరిజనులు రాకపోవడంతో ఖంగుతిన్న ఇంచార్జ్ గిరిజనులు లేకుండానే నాయకులతో హడావిడిగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించేశారు.ఈ ప్రారంభోత్సవంలో నాయకులు ప్రోటోకాల్ ఉల్లంఘించడపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.జిల్లాలో మారుమూలన ఉన్న గూడెం కొత్తవీధి మండలం ఎలుగురాతిబంద గ్రామానికి చెందిన లకే బాబురావు అనే యువకుడు కానిస్టేబుల్ కొలువు సాధించాడు.ఆ కొలువు నియామక పత్రాల కార్యక్రమం లో ఆ యువకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మా ఊరికి రోడ్డు వేయించండి అని కోరాడు.దీంతో ఆయన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు చెప్పడంతో ఆయన స్టేజి మీదే రోడ్డు మంజూరు చేయడంతోపాటు రూ. 3 కోట్లు కేటాయించారు.ఇక్కడివరకు బాగేనే ఉంది.అయితే స్థానిక తెదేపా నాయకులు మాత్రం ఆ రోడ్డు నిర్మాణం విషయంలో కొంత అత్యుత్సాహం చూపిస్తూ అక్కడి గిరిజనులకు ఇష్టం లేకుండానే హడావిడిగా ప్రారంభోత్సవం చేసేలా చర్యలు తీసుకున్నారు. తెదేపా పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ ని శనివారం ఆ రోడ్డు పనులు ప్రారంభించేందుకు తీసుకువచ్చారు.అయితే ఆ గ్రామానికి చెందిన గిరిజనులు రోడ్డు ప్రారంభోత్సవానికి నిరాకరించారు.తమ గ్రామానికి అనువుగా ఉండే మార్గంలో కాకుండా వేరే మార్గంలో రోడ్డు వేయడం వారికి ఇష్టం లేకున్నా ఆ విషయం మండల నాయకులకు తెలిసినా ప్రారంభోత్సవానికి రావడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రారంభోత్సవానికి రాలేదు.దీంతో చేసేదేం లేక ప్రజలు లేకుండానే నాయకులు కొబ్బరి కాయ కొట్టి వచ్చేశారు. ప్రోటోకాల్ పాటించకుండా, గిరిజనులకు ఇష్టం లేకుండా రోడ్డు ప్రారంభించడంపై కూటమి నాయకులతోపాటు, వైకాపా నేతలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.ఇదే విషయంపై రోడ్డు మంజూరు చేయించిన కానిస్టేబుల్ లకే బాబూరావు మాట్లాడుతూ స్థానికులకు అనువైన మార్గంలో రోడ్డు వేయాలని కోరారు.



# జెడ్పీ అతిథి భవన నిర్మాణానికి శంకుస్థాపన - జడ్పీ చైర్ పర్సన్

- 25 లక్షల నిధులు మంజూరు చేసిన జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర.
- జిల్లా పరిషత్ అతిది గృహం త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశాలు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** మండల కేంద్రంలో జిల్లా పరిషత్తు అతిథిగృహ భవన నిర్మాణానికి జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర శనివారం నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో వచ్చే అతిధుల కోసం, అధికారుల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రత్యేకంగా ఓ భవనం ఉండాలని జిల్లా పరిషత్ లో భాగమై ఉంటే బాగుంటుందని తమ ఆలోచనలకు అంకురార్పణ జరిగిందన్నారు. జిల్లా పరిషత్తు పాత ప్రాంగణంలోనే నిర్మాణం చేపట్టాలని దీని కోసం ప్రత్యేకంగా రూ. 25 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ అతిథి గృహ భవన నిర్మాణం జరిగితే ఇక్కడకు వచ్చేవారు ఎంతోమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఉపయోగ పడుతుందన్నారు. పర్యాటకంగా ముంచంగిపుట్టు వచ్చే పర్యాటకులకు ఈ భవనం అద్దెకిచ్చి ఆ నిధులు జిల్లా పరిషత్తు ఆదాయం కూడా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాను జిల్లా పరిషత్ చైర్పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఈరోజు వరకు ప్రజల అవసరాల మేరకు ప్రాధాన్యత క్రమంలో తన నిధులను కేటాయించడం జరుగుతుందన్నారు. తాను కేటాయిస్తున్న ప్రతి రూపాయి మౌలిక వసతుల కల్పన కోసమే ఎక్కువ నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఆంధ్రప్రదేశ్ లో సచివాలయాలతో సహా అన్ని చోట్ల మౌలిక వసుతుల కల్పన కోసమే ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందన్నారు. జడ్పీ గెస్ట్ హౌస్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి, కించాయిపుట్టు సర్పంచ్ సుభాష్, సుజనకోట సర్పంచు రమేష్, ఏనుగురాయి సర్పంచ్ నర్సింగరావు, జోలాపుట్ ఎంపిటిసి కమల, సుజనకోట ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి పద్మ రావు, సీనియర్ నాయకులు జి. సన్యాసిరావు, రాజారావు, అర్జున్, జయదేవ్, రాంప్రసాద్, జెవివిఎన్ మూర్తి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, జె తిరుపతి, ఎస్ తిరుపతిరావు, బుద్ధ, ఏం రాంప్రసాద్ఎన్ సురేష్ ఎస్ వరహాలమ్మ, రిటైర్డ్ టీచర్ ప్రసాద్ రావు పడాల్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన ప్రజా బడ్జెట్ గంటా శ్రీనివాసరావు



**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14 :** రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం గా ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధనకు బాటలు వే స్తుందని భీమిలి ఎమ్మెల్యే పేర్కొన్నారు. శనివా రం అసెంబ్లీలో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రవేశపెట్టిన రూ. 3.32 లక్షల కోట్ల అంచనా వ్యయ బడ్జెట్ను ఆయన ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే "ప్రజా బడ్జెట్"గా అభివర్ణించారు.

విశాఖ ఎకనామిక్ జోన్కు రూ. 28 కోట్ల కేటా యింపులు చేయడం ద్వారా ఉత్తరాంధ్రతో పా టు తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల పారిశ్రామి క అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. రా యలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్కు రూ. 30 వేల కోట్ల ప్రకటన ప్రాంతాల మధ్య సమతుల అభివృద్ధికి సంకేతమన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం విశేష ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొం టూ, పాఠశాల విద్యకు రూ. 32,308 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. జలవనరుల అభివృద్ధికి రూ. 18,224 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 13,598 కోట్లు, 'అన్నదాత సుఖీభవ' పథకానికి రూ. 6, 660 కోట్లు, పోలవరానికి రూ. 6,105 కోట్లు కేటాయించడం రైతు సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతను స్పష్టం చేస్తుందన్నారు. మౌలిక వసతుల బలోపేతానికి విద్యుత్ రంగానికి రూ. 13,934 కోట్లు, రోడ్లు, పోర్టులు, విమానాశ్ర యాలకు రూ. 13,546 కోట్లు కేటాయించడాన్ని ఆయన స్వాగతించారు. పంచాయతీ రాజ్ శాఖకు రూ. 22,942 కోట్లు, మున్సిపల్ శాఖకు రూ. 14,539 కోట్లు కేటాయించడం ద్వారా గ్రామీణ, పట్టణాభివృద్ధికి సమాన ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. అలాగే ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం సమయోచితమని అభిప్రాయపడ్డారు. పోలీస్ శాఖకు 3 వేల కొత్త వాహనాలు, పోలీస్ అకాడమీ కోసం 94 ఎకరాల భూమి కేటాయిం చడం ద్వారా భద్రతా వ్యవస్థ మరింత బలోపే తం అవుతుందని తెలిపారు.

అన్ని రంగాలకు సమగ్ర కేటాయింపులతో రూ పొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక పురోగతికి బలమైన పునాది వేస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.

## ప్రధానోపాధ్యాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన స్కూల్ కమిటీ సభ్యులు

- పాఠశాల అభివృద్ధిపై చర్చలు
- విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 14:** గూడెం కొత్త వీధి మండలంలోని రింతాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతనంగా నియమితులైన ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ను పాఠశాల కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యా కమిటీ చైర్మన్ మొట్టడం శర్భన్న దొర, ఉప సర్పంచ్ మడపల సోమేష్కుమార్ విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, పాఠశాల అభివృద్ధి అంశాలపై ప్రధానోపాధ్యాయుడితో కొంతసేపు చర్చించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు బొబ్బిలి వెంకట్రావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా వీరజవాన్లకు ఘన నివాళులు



**ఆనందపురం ,పెన్ పవర్ , ఫిబ్రవరి14**

14. ఫిబ్రవరి 2019 దినాన జమ్ము కాశ్మీర్ లో భారత సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు కాన్వాయ్ మీద కారుతో ఆత్మహుతి బాంబు దాడి చేశారు ఈ దాడి కారణంగా 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అనగా సిఆర్పిఎఫ్ సైనికులు ఈ దాడిలో మరణించారు పాకిస్తాన్లో నెలకొన్న కార్యకలాపాలు సాగిస్తున్న ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ జైషా-ఎ మహమ్మద్ ఈ దాడికి సూత్రధారి కాశ్మీరికి చెందిన అదిల్ అహ్మద్ దార్ అని ప్రకటించింది. ఈ దాడిలో వీరమరణం పొందిన అమరులైన జవాన్లను స్మరించుకుంటూ ఆనందపురం గ్రామ పంచాయతీ లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు అమర జవాన్లకు జోహార్ జోహార్ భారత మాత ముద్దు బిడ్డలకు జోహార్ జోహార్లు అంటూ నివాళులర్పించి వారి యొక్క పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు ఈ కార్యక్రమంలో ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వాసు నాయుడు ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ పాప్పల పాపారావు జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను ట్రెజరీ కుప్ప రామలక్ష్మి సెక్రెటరీ కొట్టాడ రెడ్డి బాబు కుప్ప గురువులు శ్రీను నరసింహామూర్తి పైడినాయుడు గ్రామ యువత 24 కాలనీ బాలలు పాల్గొనడం జరిగింది

## బాల్యవివాహాలకు వ్యతిరేకంగా గల్లం విప్పాల్సిన అవసరం ఉంది.

పార్వతీపురం జిల్లా రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి దామోదర్ రావు.





**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 14 పెన్ పవర్.** బాల్య వివాహ విముక్తి రథం ప్రారంభించిన పార్వతీపురం జిల్లా రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి దామోదర్ రావు. బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి.ఎస్ దామోదర్ రావు అన్నారు. మన్యం జిల్లాని బాల్య వివాహరహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు చేయి చేయి కలపాలని పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాలని అన్నారు. శనివారం అప్ హోల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు నిర్వహించిన బాల్య వివాహ విముక్తి రథం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంతకం చేసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు పై అవగాహన కల్పించి వివాహాలు జరక్కుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని చట్టాలను గౌరవిస్తూ నిబంధనలను పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రచార రథం ద్వారా గ్రామాల్లో పట్టణాల్లో బాల్య వివాహాల దుష్పరిణామాలు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉమెన్ హెల్ప్ లైన్ 181 పోలీస్ హెల్ప్ లైన్ 121 అందుబాటులో ఉన్నాయని ఎవరైనా ఈ నెంబర్లకు ఫోన్ చేసి బాల్యవివాహాలపై సమాచారం అందించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఆర్ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు,సీనియర్ అడ్వకేట్స్,పోలీసు వారు సెక్రటరీలు వీఆర్వోలు మహిళ సంరక్షణ అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 14:** సీతంరాజు సుధాకర్ పేర్కొన్నదాని ప్రకారం, ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రి ఖర్చులు భరించలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తోంది.

శనివారం జీవీఎంసీ 31వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బత్తిన నవీన్ కుమార్ సమక్షంలో 31వ వార్డు చాకలిపేటలో నివాసముంటున్న పేలూరి సూరి అప్పారావుకు రూ. 1,33,799 మరియు జిల్లెల శాన్వికకు రూ. 69,591 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా వైద్య సహాయం కోరిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు అవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుమిత్ర మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబానీ ప్రభుత్వం ఆదుకోవాలి.
- ఆదివాసి గిరిజన మహిళ సంఘం మండల కార్యదర్శి ఎస్ ఈశ్వరి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో గల, బరడ పంచాయతీ, ఆడార్లాడి ముక్కిపుట్టు గ్రామానికి చెందిన వనుగు సుమిత్ర మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం కార్యదర్శి ఎస్. ఈశ్వరి డిమాండ్ చేశారు. శనివారం గిరిజన మహిళా సంఘం మండల ఉపాధ్యక్షురాలు వి. రాధతో కలిసి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరి, రాధ తెలిపిన వివరాల ప్రకారం.. వనుగు సుమిత్ర సొంత గ్రామం అడర్లడి ముక్కిపుట్టు నుండి సోమవారం అర్ధరాత్రి అపహరణకు గురై మంగళవారం తెల్లవారుజామున శవమై కనిపించిందని, ఆ రోజు నుండి పోలీస్ శాఖ వారు మృతురాలి ఫోన్ నెంబర్ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇందులో వివిధ రూపంగా భాగస్వామ్యం అయిన వారిని 24 గంటలో పట్టుకొన్న ఎస్ఐను, వారి బృందని అభినందనలు తెలిపారు. విచారణ వేగవంతం చేసి మరణానికి కారణమైన వారిని త్వరగా గుర్తించాలన్నారు. అపహరణ, సామూహిక హత్యాచారం, హత్య వంటి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మైనర్ బాలిక కనుక ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే సుమిత్ర తల్లి దండ్రులు నిరుపేద కుటుంబాలు, తండ్రి టిబి జబ్బుతో బాధపడుతున్నాడనీ, అందుకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రమాదంలో మృతి చెందిన గణేష్ కుటుంబానికి ఆదుకుంటాం

కుటుంబానికి అన్ని విధాలా సాయం -- ఏపీ జెన్కో



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 14:** ఏపీ జెన్కో ఆధ్వర్యంలో ఉన్న సీలేరు జలవిద్యుత్ కేంద్రం స్విచ్యార్డు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గంగిరి గణేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని సంస్థ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ జెన్కో డీఈ బి. బాలకృష్ణ మాట్లాడుతూ, ఘటన జరిగిన వెంటనే సంస్థ ఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్లు సుజయ్కుమార్, ఉషా స్పందించి ప్రమాదం జరిగిన తీరు గురించి ఆరా తీసినట్లు చెప్పారు. శుక్రవారం మృతుడు గణేష్ కుటుంబ సభ్యులు వినిపించిన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా ఈపీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనాలు కూడా సాధ్యమైనంత త్వరగా అందేలా అవసరమైన పేపర్వర్క్ పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించినట్లు డీఈ బాలకృష్ణ తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా సంస్థ అన్ని విధాలా సహకారం అందిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి మహోత్సవం సందర్భంగా సంతల్లో బుడియాల సందడి





- ఊరేగింపులో పాల్గొన్న జడ్పీ చైర్పర్సన్ సుభద్ర, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు.
- 16 17 తేదీలలో సుజనకోట శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి మహోత్సవం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** అల్లూరి జిల్లా, మండల పరిధిలో గల సుజనకోట పంచాయతీ కేంద్ర గ్రామమైన సుజనకోటలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి పండుగ సందర్భంగా శనివారపు సంతలో బుడియల సందడి చేశారు. శనివారం జరిగిన బుడియాల ఊరేగింపులో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వివిధ పార్టీల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే శ్రీ శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి మొక్కుబళ్లు చెల్లించేందుకు గాను భక్తులు సుజనకోట గ్రామములో గంగమ్మతల్లి వెలసిన నాటి నుండి నేటి వరకు శరీరంలో తెల్లసున్నం చరాలుగా రాసుకుని మండల పరిధిలో గ్రామ గ్రామాన బుడియాలు తిరిగి తిరిగి అమ్మవారికి మ్రొక్కుబడి చెల్లెందుకు కానుకలు ప్రజల వద్ద తీసుకోవడం ఆనవాయితీ. ఈనెల 16 17 తారీఖులలో జరుగుతున్న శ్రీ శ్రీ గంగమ్మ తల్లి మహోత్సవం నేపథ్యంలో శనివారం వారపు సంతరోజు పాత సుజనకోట, కొత్తసుజనకోట గ్రామాలకు చెందిన బుడియాలు బాజ భజంత్రీలతో, డప్పు వాయిద్యాలతో దింసా నృత్యాలు చేశారు. బుడియాలు గ్రామ పెద్దలు భారీ ఊరేగింపుగా వచ్చి మండల అభివృద్ధి కార్యాలయానికి చేరుకొని అక్కడ నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా భారీ సందడి చేస్తూ బుడియా పాటల పాడుతూ వారపు సంత మొత్తం తిరుగుతూ అమ్మవారికి కానుకలు తీసుకోవడం ప్రత్యేక ఆనవాయితీ. అలాగే భక్తులు సైతం బుడియాలకు తమకు తోచిన కానుకలు సమర్పించుకుంటారు. సోమవారం రాత్రి జాతర నిర్వహించేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. మరుసటి మంగళవారం తెల్లవారుజాము నుండి అమ్మవారికి ఆంధ్ర ఒడిశా మైదాన ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. బుధవారం ఉదయం బుడియాలు పూజారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్నానాలు చేసి బుడియాలు తీసివేయటం ఆనవాయితీగా పూర్వకాలం నుండి వస్తుంది. బుడియాల సందడి చూసేందుకు మండల ప్రజలు, చిన్నపిల్లలు తీసుకుని వచ్చి దగ్గరుండి చూపిస్తుంటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అమ్మవారు ఉత్సావకమిటీ సభ్యులు, చిన్నారులు, పెద్దలు, బుడియాలు పాల్గొన్నారు.

# నాన్-ట్రైబల్ టీచర్స్ వార్డెన్ నియామకంపై ఆదివాసి జేఏసీ నిరసన

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ తీవ్ర అభ్యంతరం



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఫిబ్రవరి 14:** మెగా డిఎస్సీ -- 2025 ద్వారా నాన్-ట్రైబల్ టీచర్స్‌ను ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ వసతిగృహాలలో వార్డెన్లుగా నియమించడం గిరిజన ఉద్యోగులకు విరుద్ధం అని ఈ విధంగా నియామకాలు చేస్తే, స్థానిక ఆదివాసీ యువతలకు ప్రతికూల ప్రభావం ఉంటుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలిపారు, భాషా పండితులు, పిఈటిలను పదిహేను రోజుల్లో అప్గ్రేడ్ చేయాలనీ జారీ చేసిన ఉత్తర్వులు నెలలుగా అమలవుతున్నట్లు లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 417 మంది భాషా పండితులు, పిఈటిలను అప్గ్రేడ్ చేయడం ద్వారా ఎక్కువ మంది ఆదివాసులకు లాభం కలగనుండగా, ప్రభుత్వం ఇది నిలవకుండా నిర్లక్ష్యం చూపుతున్నది, ఇది తీవ్రంగా ఆగ్రహకరమని అన్నారు. ఇదిలా ఉండగా, నాన్-ట్రైబల్ టీచర్స్‌ను ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ వసతిగృహాలలో వార్డెన్లుగా నియమించడం, ప్రత్యేకంగా బాలికల వసతిగృహాలలో మైదాన ప్రాంతాల యువకులను నియమించడం, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీకి అసహనాన్ని కలిగించిందని రామారావు దొర చెప్పారు. గతంలో కొన్ని ఘటనలలో ఆదివాసేతర ఉపాధ్యాయులు బాలికలపై దాడులు చేయగా, రాజకీయ ప్రభావం వల్ల చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ సమర్పించింది. చైర్మన్ రామారావు దొర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇచ్చారు -- ఉత్తర్వులను రద్దు చేయకపోతే, ఆదివాసీ యువత, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఉద్యమానికి సిద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన విద్యార్థి సంఘ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిదే మాధవరావు, డివిజన్ అధ్యక్షులు మణుగూరు బాబూజీ, రాష్ట్ర నాయకులు కిరసాని కిషోర్, జిల్లా కన్వీనర్ పార్థసారది, ఇతర మండల అధ్యక్షులు మరియు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ తీరంలో టీఎస్సార్ సేవా పీఠం 41వ మహా కుంభాభిషేకం

- మహా కుంభాభిషేకం సందర్భంగా కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అభిషేకాలు
- ఆర్కే బీచ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించిన టీఎస్సార్



**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 14**

కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో 15న .. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద జరగనున్న 41వ మహా కుంభాభిషేకానికి సంబంధించి ఏర్పాట్లను టీఎస్సార్ పరిశీలించారు. ప్రతి ఏటా టిఎస్ఆర్ తన సొంత నిధులతో నిర్వహిస్తున్న, ఈ మహా కుంభాభిషేకం సందర్భంగా కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అభిషేకాలు చేస్తారు. శనివారం సాయంత్రం వేదిక వద్ద ఏర్పాటు చేసిన శివలింగం వద్ద కొబ్బరికాయ కొట్టి సుబ్బరామిరెడ్డి పూజ చేశారు. మహా కుంభాభిషేకం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేసిన ఏర్పాట్లను టిఎస్ఆర్ పరిశీలించారు.

ఉత్సవ కమిటీ కన్వీనర్ మరియు తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి, క్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్ కార్యదర్శి ఎస్కె భాష, ఆర్.వి.వి.సత్యనారాయణ, ప్రొఫెసర్ పెంటకోట త్రినాధరావు, దల్లి రామకృష్ణారెడ్డి, రాపేటి ఉమా సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ నియోజకవర్గాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు సహకారం కోరిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విశాఖ దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు.

**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 14:** శనివారం ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజల జీవన స్థితిగతులపై చర్చించారు. విశాఖలో పాత నగరంగా పేరుగాంచిన దక్షిణ నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. కాలుష్యం సహా పలు స్థానిక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు మరింత పురోగతి సాధించేలా ప్రభుత్వ సహకారం అవసరమని తెలిపారు.

ఇటీవల 39వ వార్డు జనసేన అధ్యక్షుడు మైలపల్లి చిన్న కుమారుడు జితేంద్రకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.8 లక్షలు మంజూరు కాగా, ఎమ్మెల్యే స్వయంగా ముఖ్యమంత్రిని కలిసి మరో రూ.4 లక్షలు మంజూరు చేయించారు. వైద్య సహాయానికి అదనపు ఆర్థిక సహాయం అవసరమని వైద్యులు సూచించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి స్పందించి సీఎం సహాయనిధి ద్వారా మొత్తం సుమారు రూ.12 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు.

అనంతరం పలు అంశాలపై వినతిపత్రం సమర్పించగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రతిరోజూ పర్యావరణ పరిరక్షణ దినోత్సవమే





- ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి
- పర్యావరణ పరిరక్షణ అందరి మన బాధ్యత
- ఎన్ రామచంద్ర రావు, డి ఎఫ్ ఒ, కాకినాడ జిల్లా

**కాకినాడ పెన్ పవర్ ఫిబ్రవరి 14**

ప్రతిరోజూ పర్యావరణ పరిరక్షణ దినోత్సవమే అని కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్ర రావు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం అటవీ శాఖ కార్యాలయంలో ఆదిత్య విద్యా సంస్థ, ఆల్ ఈజ్ వెల్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ లో నేతృత్వంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాల కాలమానిని జిల్లా అటవీ శాఖ అధికారి ఆవిష్కరించిన తర్వాత మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని లేకుంటే పెను నష్టం ఏర్పడుతుంది అని పేర్కొన్నారు. ఈ కాలమానిని వినియోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని వివరించారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బర్డ్స్ మేన్ కె మృత్యుంజయ రావు, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిషోర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సోషల్ వర్కర్స్ ఒ కిషోర్, శ్రీను, గ్రీన్ క్లైమేట్ వాలంటీర్ జె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యం లో అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామ సర్వేయర్స్ యూనియన్

అల్లూరీ జిల్లా విలేజ్ సర్వేర్ల కొత్త యూనియన్

అధ్యక్షునిగా అడపా .స్వామి నాయుడు.



**పాడేరు పెన్ పవర్, ఫిబ్రవరి 14:** ఎన్నికలును జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ లకే బాలంనాయిడు మరియు అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ జన్ని బాలకృష్ణ వారి ఆధ్వర్యం లో పాడేరు లో శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆడిటోరియం నందు నిర్వహించటం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికలలో 11 మండలాల గ్రామ సర్వేర్లు పెద్ద మొత్తంలో పాల్గొని ఎన్నికలను విజయవంతం చేయటం జరిగిందని అన్నారు. ఈ యొక్క ఎన్నికల సమావేశం లో గత కార్యక్రమాలపై సమీక్ష మరియు ప్రస్తుత గ్రామ సర్వేయర్ల సమస్యలు,గ్రామ సర్వేయర్స్ కు ప్రభుత్వ హామీలుమరియు పలు అంశాలపై పెద్దఎత్తున చర్చలు నిర్వహించటం జరిగిందని అన్నారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలలో ఇద్దరు అధ్యక్ష పదవికి పోటీపడగా అలానే కార్యదర్శి పదవికి ఇద్దరు మరియు సహాయకార్యదర్శి పదవి కి ఇద్దరు పోటీ వాడటం తో పాటుగా కోశాధికారి పదవికి కూడా ఇద్దరు పోటీపడటం జరిగిందని అన్నారు. ఈ యొక్క ఎన్నికల్లో అధ్యక్షత పదవికు 7 ఓట్ల మెజారిటీతో అడపా స్వామినాయుడు గెలుపొందటం జరిగిందని,కార్యదర్శి పదవి 13 ఓట్లతో పి.మణికంఠ గెలుపొందటం జరిగిందని,సహాయ కార్యదర్శి 69 ఓట్ల మెజారిటీ తో యం. ఏలీయా గెలుపొందటం జరిగిందని,కోశాధికారి పదవి 11 ఓట్ల మెజారిటీ తో ఎస్.రాజేష్ గెలుపొందటం జరిగిందని,అలానే సలహాదారులుగా టమికే శివ శంకర్ బాబు,ఉపాధ్యక్షులు శివరాజ్ కుమార్,స్పోర్ట్స్ మరియు కల్చరల్ కార్యదర్శి దెబుగున్న,ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలరాజునాయుడు,మహిళ కార్యదర్శి సుజాత,లీగల్ అండ్ డిస్పిలినరీ కార్యదర్శి చంటి బాబు, వెల్ఫేర్ కార్యదర్శి వీరయ్య,కమ్యూనికేషన్ మరియు ఐటి సెక్రటరీ చంద్ర శేఖర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగిందని అన్నారు. ఈ యొక్క ఎన్నికలు ఎటువంటి ప్రలోభాలకు మరియు రాగద్వేషాలు లేకుండా ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు తోవ ఇవ్వకుండా స్వతహాగా గ్రామ సర్వేయర్స్ స్వచ్ఛందం గా పాల్గొని తమ విలువైన ఓట్లను వినియోగించుకొని ఎన్నుకోబడటం జరిగిందని అన్నారు. అనంతరం ఈ సందర్భంగా నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్ష, కార్యదర్శి లు మాట్లాడుతూ భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకొని గ్రామ సర్వేయర్స్ సమస్యలపై పోరాటాలకు రూపకల్పన కు సిద్ధమవుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గ్రామ సర్వేయర్స్ ల ప్రమోషన్ లను వేగవంతం చేయాలని మరియు ప్రభుత్వ రీసర్వే విషయం లో పని వత్తిడి తగ్గించాలని మరియు రీ సర్వే విధులు నిర్వహించిన వారి యొక్క టి. ఏ.మరియు డి. ఏ. లను తక్షణమే చెల్లించాలని,పని గంటలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలకు వరకు మాత్రమే ఉండేలా చూడాలని,మాయొక్క పనులు కాకుండా ఇతరేతర పనులు నుండి మమ్మల్ని వైదొలిగించాలని, సెలవు దినాలును పటిష్టంగా అమలు చేయాలని,గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల మాదిరిగా గ్రామ సర్వేయర్స్ కు 32000 కనీసం వేతనం చెల్లించాలని,సచివాలయ ఉద్యోగుల మదిరిగా అన్ని ప్రయోజనాలు గ్రామ సర్వేయర్స్ కు కూడా అమలు చేయాలని అన్నారు. ఈ యొక్క సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్ర వ్యాపిత ఉద్యమాలకు తెరలేపుతామని అన్నారు.

# పుల్వామా దాడిలో అమరులైన వీర జవానులకు నివాళులు



**అల్లవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**

విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అల్లవరంలో పుల్వామా దాడిలో అమరులైన వీర జవానులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఇలాంటి ఉగ్రవాద చర్యల పై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని భారత్ లో ఉగ్రవాదులు దాడులు చేయాలంటేనే వెన్నులో వణుకు పుట్టేలా శిక్షలు ఉండాలని, ఈ దుశ్చర్యకు నిరసనగా కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్టా నారాయణమూర్తి కంకిపాటి వీరబాబు మాకిరెడ్డి సత్తిబాబు అల్లుఅర్జున్ కొమ్ముల రామచంద్ర రావు కంకిపాటి సుబ్బారావు యాటి గోపాలం కాండ్రేగుల వెంకటేశ్వరరావు కుడిపూడి నాగేశ్వరరావు వంగానాయుడు కంకిపాటి శాంతి మరియు తదితరులు పాల్గొన్నారు

# చిల్లంగి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం.

-స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదములు స్వీకరించిన భక్తులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి చిల్లంగి, కిర్లంపూడి,జగపతినగరం గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడమే కాకుండా అన్న ప్రసాదములు స్వీకరించారు. శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప ఆధ్యాత్మిక వేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడమే కాకుండా, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి వారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమానికి పలువురు భక్తులు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం చాలా సంతోష దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com